# తెలుసుకున్న తప్పు

పదిరోజుల తర్వాత భానుమూర్తిని కలియడం అదే ప్రథమం కేశవరావుకి. ఒకర్నొకరు చూసి ఒకరు మందహాసం ఒలికించారు.

"ఎప్పుడు వచ్చేశావురా?" అన్నాడు కేశవరావు.

"ఏదీ యివ్వాళే. ప్రస్తుతం యిలా మీా యింటికే బైలుదేరాను. ఆడబోయిన తీర్థం యెదురైనట్లుగా, త్రోవలో నువ్వే కలిశావు. పద అలాపోయి 'ఉడిపి' లో కాఫీ తాగుదాం" అంటూ స్నేహితుడి భుజమ్మీాద చెయ్యివేసి, తనతో తీసుకుపోయాడు భానుమూర్తి.

భానుమూర్తి కాస్త డబ్బున్నవాడు డబ్బుందని, దాన్ని ఖర్చు చెయ్యడానికి భయపడి, గట్టిగా పట్టుకునే స్వభావం అతనిలో తక్కువనే చెప్పాలి. అడపాదడపా స్నేహితుల కోసం, కాఫీహోటళ్ళలోనో, సినీమాలకో, ఖర్చుపెడుతూనే వుంటాడు. ఏ స్నేహితుడైనా అవసరముండి అప్పు అడిగితే ఆదుకుంటాడు. అంతేగాని, కొందరిలా డబ్బు పుష్కలంగావున్నా, దమ్మిడీ చేతిలోలేదని చెప్పే విధానం అతనికి నచ్చదు.

ఇద్దరూ టిఫిను తీసుకుంటున్నారు. కాస్సేపు మౌనం. తర్వాత కేశవరావు ప్రారంభించాడు.

"మీవాళ్ళను తీసుకొచ్చేవా?" అని

"అసలు వెళ్ళడం అందుకేగా!" నవ్వుతూనే అన్నాడు భానుమూర్తి.

"నిజంగా, నువ్వు చాలా అదృష్టవంతుడివిరా భానూ! మంచి అత్తవారినీ, అంతకు మించిన మంచి భార్యనూ సంపాదించావు."

కేశవరావు మాటలకు, భానుమూర్తి తృప్తిగా నవ్వుకున్నాడు. అతనికీ తెలుసు - స్నేహితుడి మాటల్లో నూరుపాళ్ళ సత్యముందని. మందహాసంతో మొహాందించుకొన్నాడే గాని, మరేమీ జవాబు చెప్పలేకపోయాడు.

కేశవరావు, భానుమూర్తి, ప్రాణస్నేహితులు. చిన్నప్పట్నుంచీ ఒకే దగ్గర పెరిగారు... చదివారు... వుద్యోగాలు కూడా ఒకే ఆఫీసులో వెలిగిస్తున్నారు. అందుకే వారిది విడవడని అనుబంధం. ఆ అనుబంధంవల్లనే వాళ్ళల్లో చాలా సన్నిహితమైన సంభాషణ సాగుతుంది.

ఇద్దరూ కాఫీ ముగించి, బైటపడ్డారు.

"మాయింటికి పదరా!" అన్నాడు భానుమూర్తి

"ఇంకెందుకురా! నువ్వు కలిశావుగా! అలా రీడింగ్ రూమ్‌కి పోదాం పద..." అన్నాడు కేశవరావు.

"అదేవిట్రా? మనం యెప్పుడూ కలుస్తూవుంటాం. అలాగని యిళ్ళకు రావడం మానేస్తామా? మా యింట్లో కాస్సేపు కూచుని మాట్లాడుకుందాం పద."

కేశవరావు కాదనలేకపోయాడు. స్నేహితుడి మనసు నొప్పించడం అతడికి యిష్టం లేకపోయింది.

"సరే...." అన్నాడు.

ఇద్దరూ బైలుదేరారు. త్రోవలో అనేక విషయాలు మాట్లాడుకున్నారు. భానుమూర్తి ఇల్లుచేరుకున్నారు. భాను మూర్తి భార్యవచ్చి తలుపు తెరిచింది. ఆమెను చూడ్డం, కేశవ రావుకి అది రెండోసారయినా, దగ్గర్లో చూడ్డం అదే ప్రప్రథమం. మెరుపు తీవెలావున్న ఆమెవేపు క్షణం చూడకుండా వుండలేకపోయాడు. ఆమె మొహం దించుకొని లోపలికి పోయింది.

స్నేహితులిద్దరూ వరండాలో కూచున్నారు. భాను మూర్తి టేబిలుమీదున్న వారపత్రిక స్నేహితుడి చేతికి అందిస్తూ "ఈ పుస్తకం చూస్తూవుండరా! ఇప్పుడేవస్తా" అంటూ లోపలికి పోయాడు.

పుస్తకంలోని పేజీలు తిరగేస్తున్నాడేగాని, కేశవరావు మస్తిష్కం ఆలోచనల మయమయ్యింది. అతని కళ్ళల్లో, అప్పుడే చూసిన భానుమూర్తి భార్య రూపం లీలగా మెదిలింది. ఎంత అందమైన వ్యక్తి? బ్రహ్మ యీమెను ప్రత్యేకంగా సృజించాడేమో ననిపిస్తుంది. ఆ కళ్ళల్లోనే ఆమె అందమంతా కేంద్రీకృతమైవుంది. ఆ చిన్న పెదాలు, కోటేరు వేసి

నట్టు కొట్టొచ్చినట్టుండే ఆ సన్నని ముక్కు, సువిశాలమైన ఫాల భాగంపై తళతళ మెరిసే యెర్ర కుంకుమబొట్టు—ఓహ్, యెంత ఆకర్షణీయంగా వున్నాయి? నిజంగా భానుమూర్తి అదృష్టవం తుడు! ఆమె పేరేమిటో! ఆ....అన్నట్టు మర్చేపోయాను. శారదకదూ! పేరుకూడా యెంతో మృదువుగా వుంది. ఈ విధమైన అదృష్టం, అందరికీ లభ్యం అవుతుందా! అబ్బే....

పద ధ్వని వినిపించి కేశవరావు, ఆలోచనలకు భంగ పాటు కలిగింది. తలెత్తాడు- వస్తున్నది భానుమూర్తే! మళ్ళీ పుస్తకం తిరగెయ్యడం ప్రారంభించాడు.

"ఒరేయ్, ఈ వేళమాత్రం వద్దనకుండా యీ టిఫిను తీసుకుని కాఫీ సేవించాలిసుమా" అంటూ ప్లేటును బల్లమీద పెట్టాడు భానుమూర్తి.

"ఇదేవిట్రా మళ్ళీ? ఇప్పుడేగా హోటల్లో టిఫిను చేశాం..." అన్నాడు కేశవరావు ఆశ్చర్యంతో టిఫినువున్న ప్లేటు వేపు చూస్తూ

"అదిగో! అదే వద్దంటా. అభ్యంతరం చెప్పకుండా ఆర గించాల్సిందే తెలుసా? మా ఆవిడ వాళ్ళింటినుండి తెచ్చి నవి....ఊ ...కానియ్ ...." అంటూ ఓ కజ్జికాయతీసి స్నేహితు డికి అందించాడు భానుమూర్తి.

కేశవరావు మారు మాటాడకుండా తీసుకుని తినడం ప్రారంభించాడు.

"చాలా బావున్నాయిరా" అన్నాడు. ఆ పదార్థం నిజంగా బావుందో లేదోగాని, శారదపై అవ్యక్తంగా అతనికి గల అభిమానం యొక్క ప్రభావమేమో అది!

"ఉండు.... కాఫీ తీసుకొస్తా...." అంటూ లేచి మళ్ళీ వెళ్ళాడు భానుమూర్తి. కేశవరావు వద్దని వారిస్తున్నా, విని పించుకోలేదు.

కేశవరావు ఒంటరిగా కూచుని సరాసరి ప్లేటు ఖాళీ చేసేశాడు. ఆ తర్వాత అతనికే ఆశ్చర్యం కలిగింది. 'ఇప్పుడి వన్నీ యెందుకు?' అన్నది తనేనా అనుకున్నాడు. అతనికళ్ళు అప్పుడప్పుడు లోపలి ద్వారంవేపు దృష్టిని సారిస్తున్నాయి 'శారద మరొక్కసారి మెరుపులా కనిపిస్తే యెంత బావుణ్ణు' అని అతని మనసు ఘోషించింది. అయినా లాభమేం లేక పోయింది పాపం!

భానుమూర్తి కాఫీ తీసుకొచ్చాడు. ఇద్దరూ తీసి కున్నారు.

"చంపావురా భానూ! కదల్లేని స్థితికి వచ్చేశాను తెలుసా?" అన్నాడు నవ్వుతూ కేశవరావు.

"ఒక్కరోజుకేం లేరా! కాస్త శ్రమ.... అంతేనా?" తనూ నవ్వుతూనే అన్నాడు భానుమూర్తి.

"అలా వెళ్దాం పదరా భానూ!" అంటూ లేచాడు కేశవరావు.

"మళ్ళీ నన్ను రమ్మంటావా?" ఆసక్తి లేనట్టుగా అయి ష్టంగా అన్నాడు భానుమూర్తి,

"అదేమిట్రోయ్? అప్పుడే పహరా ప్రారంభించావా యేమిటి? యిలా యింటి పట్టున కూచోవడంకూడా మంచిది కాదుసుమా! పెళ్లాం చెంగుపట్టుకుని వదలకుండా వున్నాడని లోకులు ఆడిపోసుకుంటారు." పరిహాస ధోరణిలో అన్నాడు కేశవరావు

భానుమూర్తి వెంటనే కాస్త దెబ్బతిన్నా, క్రమంగా సంబాళించుకున్నాడు,

"స్వానుభవంతో సెలవిస్తున్నావల్లేవుంది" ఎదురు దెబ్బ కొట్టాడు. కేశవరావు నవ్వేశాడు.

"ఏదోలే.... బైలుదేరు."

ఇద్దరు బైటకి నడిచారు.

* * *

ఆ రోజునుండి కేశవరావుకి శారదపై వ్యక్తమైన ప్రేమ అంకురించింది. అది అతని ప్రయత్నం కాకపోవచ్చు. అతని మనసు బలహీనత కావచ్చు అయినా, అతనూ కొంత వరకు బాధ్యుడే! భానుమూర్తి యింటికి వచ్చినపుడంతా ఓసారి యింట్లోపలికి దృష్టిని సారించేవాడు కనీసం, శారద చీరచెంగు కనిపించినా సరే, ఓవిధంగా తృప్తిపడేవాడు లేని నాడు నిర్జీవంగా తిరిగి వచ్చేవాడు.

తన ప్రాణ స్నేహితుడి పత్నిపట్ల తన ప్రవర్తన అసభ్యంగా వుంటున్నదని అతనికి తెలుసు అయినాసరే ఆ భావన నుండి దూరంగా వుండలేకపోతున్నాడు. ఆమె అందం, ముఖ్యంగా ఆమె కళ్లు అతణ్ణి వివశుణ్ణి చేసేస్తున్నాయి. అదే, అతను అంతరాత్మకు చెప్పుకున్న సంజాయిషీ.

ఒక రోజు భానుమూర్తియింటికి వెళ్ళాడు కేశవరావు. ఆనాడు భానుమూర్తి, అర్జంటుగా వూరికెళ్ళాల్సి వచ్చింది. కేశవరావుకి ఆ సంగతి తెలీదు. కేక వేశాడు.

తలుపు తెరుచుకున్నది ఎదురుగా నిల్చున్నది భానుమూర్తికాదు... శారద! పసిడి బొమ్మలా నుంచుంది. తన కళ్ళను తనే నమ్మలేకపోయాడు కేశవరావు. తను ఆరోజు ఎంతో అదృష్టశాలి.... సాక్షాత్తూ వనదేవతలా యిన్ని మల్లెపూలు తల్లో తురుముకొని తెల్ల చీర కట్టుకుని ప్రత్యక్షమైన శారదను కళ్ళప్పగించి, కాస్సేపు తదేకంగా చూడకుండా వుండలేకపోయాడు. అసలు, తను భానుమూర్తికోసం వచ్చాడన్న విషయంకూడా మర్చిపోయాడా సమయంలో.

శారద, అతని దృష్టిని తట్టుకోలేకపోయిందో లేక అతని అసభ్య ప్రవర్తనకి అసహ్యించుకుందో మరి — తలుపుచాటుకి పోయి "లేరండీ! అర్జంటు పనివుండి వూరికి వెళ్ళారు.... రేపు వస్తారు ..." అంది.

ఆమె తలుపుచాటుకి పోయేసరికి కేశవరావులో చైతన్యంవచ్చి వాస్తవిక ప్రపంచంలో పడ్డాడు. తను చాలా అసభ్యంగా ప్రవర్తించానని, అప్పుడు బాధపడ్డాడు. కాని, శారద

అందం, ఆమె కళ్ళల్లోని కాంతి యింకా అతని దృష్టిలో మెదల్తూనేవుంది.

"ఈవాళ ఆఫీసుకి రాలేదేమోనని వచ్చానండీ, వస్తా" అంటూ ఆమె జవాబుకైనా చూడకుండా వెనక్కి మళ్ళిపోయాడు. తలుపు మూసుకుంది.

కేశవరావు మెల్లగా నడుస్తున్నాడు. వనదేవతలావున్న ఆ వనిత పదేపదే అతనికి గుర్తుకురాసాగింది. అప్పుడప్పుడు ఆమెను మనసులో నింపుకొని తన్మయం పొందేవాడు. కనీసం ఆమెతో ఒక్కక్షణం మాట్లాడవల్సింది. ఛా! అయాచితంగా లభించిన అవకాశాన్ని చేతులారా జారవిడుచుకున్నందుకు తనని తనే తిట్టుకున్నాడు ఇటువంటి అవకాశం మళ్ళీ లభ్యమౌతుందా.... అని తలపోశాడు క్రమంగా అతనిలో శారదపై మోజు యినుమడించింది. ఆమెను యెలాగైనా పరిచయం చేసుకోవాలన్న ఆసక్తి అధికమయ్యింది. ఆ క్షణంలో అతనికి శారదే ప్రపంచమంతా ఆవరించుకున్నట్టుగా అనిపించడంలో అతిశయోక్తి లేదేమో!

కామం అగ్ని జ్వాలలా ప్రజ్వరిల్లి మనిషిని దహించుతుంది. అది తెలిసికూడా, మానవుడు ఆ ప్రయత్నానికి దూరంగా వుండలేక పోతున్నాడంటే, కేవలం మానసిక బలహీనతే కారణం ఈ బలహీనతవల్ల విచక్షణాజ్ఞానం నశించిపోతుంది. విజ్ఞానం కొరవడుతుంది. స్నేహం అగుపించదు. బంధుత్వం కనిపించదు. మర్యాదమృగ్యమౌతుంది. అదే మానవుని పతనానికి ప్రారంభ దశ!

కేశవరావు మానవాతీతుడు కాదు. అదే బలహీనతకి లోనయ్యాడు. లేకపోతే, తనని ప్రాణసమానంగా చూసు కుంటున్న స్నేహితుడు భానుమూర్తి భార్యపట్ల, యీ విధ మైన భావం తెచ్చుకునేవాడు కాదు. అతనికి పాప పుణ్యాలు కూడా గుర్తుకు రాలేదు. శారదతో మాట్లాడే అవకాశం యెప్పుడు లభిస్తుందా అని, యెదురు తెన్నులు చూస్తున్నాడు.

మనిషి తలచేది ఒకటవుతే జరిగేది మరొకటవుతుందన్న సామెత వుంది. కేశవరావు యే అవకాశంకోసమైతే యెదురు తెన్నులు చూస్తున్నాడో, ఆ అవకాశం రానేలేదు. ఎప్పుడూ యేదో ఒక ఆటంకం ప్రత్యక్షమాతూనే వుంది. ఈ నిరాశ, అతనిలో మరింత పట్టుదలని రేకెత్తించింది.

* * *

రోజులు కాలగర్భంలో లీనమాతున్నాయి.

హఠాత్తుగా భానుమూర్తి వాళ్ళ మేనమామ గారింటికి వెళ్ళవల్సి వచ్చింది. దూరప్రయాణం అవడంవల్లను, తల్లి ఒంటరిగా యింట్లో వుండడానికి భయపడుతుండడం వల్లనూ శారదను తన వెంట తీసుకువెళ్ళడం మానేశాడు. శారదకు కూడా భర్తతో వెళ్ళాలన్న తలంపులేదు దూరప్రయాణం అంటేనే ఆమెకి భయం.

భానుమూర్తి తను వూరికి వెళ్తున్నట్టు చెప్పేసరికి కేశవరావు అంతరాళంలో అమితానందం పొందాడు. ఇదో

ఖచ్చితమైన అవకాశం అనుకున్నాడు. అతని కళ్ళకు మైకం కమ్మి శారదే గుర్తుకు వచ్చిందా క్షణంలో.

స్నేహితుణ్ని సాగనంపడానికి స్టేషనుకి వెళ్ళాడు కేశవ రావు. బండి కదిలేసమయం ఆసన్నమయ్యింది.

"ఒరేయ్ కేశవా! ఇంట్లో అమ్మ, శారద వుంటారు. ఇద్దరూ ఆడవాళ్ళే! ఏ అవసరం వచ్చినా యెక్కడికీ వెళ్ళ లేరు. నువ్వుమాత్రం రోజూ వెళ్ళి అగుపిస్తూవుండు. నువ్వ వస్తుంటావని యింట్లో చెప్పాలే. ఇలా చెప్తున్నాడని నువ్వ మరోవిధంగా అనుకోకుసుమా! నీకంటె ఆప్తులు యింకెవరు న్నారు చెప్పు? నాలుగురోజుల్లో వచ్చేస్తా..." అన్నాడు భానుమూర్తి.

భానుమూర్తి అంటున్న ఒక్కో మాటా ఒక్కో తుపాకి గుండులా గుండెల్లో దూసుకుపోయింది కేశవరావుకి. భానుమూర్తి తనని యెంతగా నమ్ముతున్నాడు? నిజమైన స్నేహితుడికి తగ్గవిలువ యిస్తున్నాడు. కాని, తనో? వాడి భార్య అభిమానం పొందాలన్న తుచ్ఛవాంఛను పెనవేసు కున్నాడు. వాడికే అపకారం తలపెట్టాడు. ఇంజను కూత వేసింది.

"వస్తారా మరి..." అన్నాడు భానుమూర్తి, కేశవ రావు అలా మౌనంగా యెందుకున్నాడో గుర్తించకుండానే.

"సరేరా! వేగిరం వచ్చేయ్"

రైలు కదలింది. కేశవరావు మాటలు ఆ శబ్దంలో కలిసిపోయాయి. భానుమూర్తి కనుచూపుమేర దాటేవరకు చెయ్యివూపుతూనే వున్నాడు.

కేశవరావు భారంగా అడుగులు వేసుకుంటూ యింటికి బైలుదేరాడు. భానుమూర్తి మాటలు అతని చెవుల్లో గింగుర్లుపెట్టాయి. మెదడులో రైళ్ళు ఢీకొన్నంత సంక్షోభం చెలరేగింది. ఛీ! తను కుటిలహృదయుడయ్యాడు? తనకపట ప్రవర్తన భానుమూర్తి యే మాత్రం పసిగట్టినా, యేమనుకుండేవాడో! అసలు, తనని భగవంతుడుమాత్రం క్షమిస్తాడా?.... అనుకుంటూ కలవరపడ్డ హృదయంతో చరచరా యింటికేసి నడిచాడు. అతనిలో సంక్షోభం పరాకాష్టనందుకుంది. తను చేసిన ప్రయత్నం 'తప్పు' అని తెలుసుకుని తనలోతనే పశ్చాత్తాపపడ్డాడు. ఇప్పటికైనా తను కళ్ళు తెరవగలిగినందుకు, అలా తెరిపించినందుకు భగవంతుణ్ని మనసులో స్తుతించాడు.

అంతే! ఆ మరునటి రోజునుండి కేశవరావు ఆ వేదనతో మంచమెక్కాడు. భానుమూర్తి వూరునుండి తిరిగి వచ్చేసరికి, యింకా అతడు అస్వస్థతగానే వున్నాడు

తన మానసికాందోళన తనని యీ స్థితికి తెచ్చిందని కేశవరావు యెవరితోనూ చెప్పలేదు. భానుమూర్తితోనూ చెప్పలేదు, చెప్పుకోలేదు కూడాను. చెప్పినా భానుమూర్తి కాదు- యెవ్వరూ అతణ్ని క్షమించరు...క్షమార్హుడు కాడు!